ప్రజాశక్తి
మంగళవారం 3 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం

4 నుంచి డయల్ యువర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

పార్వతీపురం : డయల్ యువర్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కార్యక్రమాన్ని ఈ నెల 4నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, యువతకు నైపుణ్య శిక్షణ సమాచారం, నమోదు, ఇతర జీవనోపాధి వివరాలు అందిస్తామన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయం ఫోన్ నంబరు 7075382163కు ఈనెల 4 నుంచి పని దినాల్లో ప్రతి రోజూ ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఇంటి వద్ద నుండే ఒక ఫోన్ కాల్ లేదా వాట్సాప్ ద్వారా కావాల్సిన సమాచారం తెలుసుకొనేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మన్యంలో మలేరియా విజృంభణ

- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- రోగులతో ఏరియా ఆసుపత్రి కిటకిట

ప్రజాశక్తి - సీతంపేట

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు తొందరగా పలకరించాయి. దీంతో వర్షాలు విస్తారంగా కురిసాయి. వర్షాల్లో తడవడం, కొత్తనీరు, కలుషిత జలాలు తాగడం, ఇటీవల కాలంలో తీవ్రమైన ఎండలు కావడంతో చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా వైరల్ మలేరియా చాప కింద నీరులా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ఏరియా ఆసుపత్రిలో పిహెచ్‌సిలు, మలేరియా, వైరల్ రోగాలతో ఆసుపత్రి కిటకటలాడుతుంది. ప్రతి ఇంట్లో మలేరియాతో పాటు వైరల్ జలుబు దగ్గు జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో రోగులు ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఒకే బెడ్‌పై చికిత్స పొందుతున్న ఇద్దరేసి రోగులు

స్థానిక ఏరియా ఆసుపత్రి మలేరియా, వైరల్ ఫీవర్ రోగులతో కిటకిటలాడుతోంది. ఇప్పటికే సీతంపేట ఏజెన్సీకి చెందిన ఈతమానుగూడకు చెందిన మండంగి పున్నయ్య, పూతికవలస చెందిన మండంగి అబ్బాయి ఆరిక చిన్నారావు, గోలుకుప్ప చెందిన నిమ్మక నాగేశ్వరరావు, చింతాడకు చెందిన సవర అజిత, జోనగాకు చెందిన సవర చక్రవర్తి, అడ్డాకులు గూడకు చెందిన సవర శ్రీను స్థానిక ఏరియా ఆసుపత్రిలో మలేరియా చికిత్స పొందుతున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోజుకు 250 ఒపి ఉంటే వాటిలో మలేరియా 15 కేసులు, వైరల్ 50 కేసుల వరకు నమోదవుతున్నాయి. రోజుకు ఏరియా ఆసుపత్రికి 15 నుంచి 20 వరకు మలేరియా కేసులు వస్తున్నాయి. సోమవారం ఏరియా ఆసుపత్రి రోగులతో కిక్కిరేసింది. 323 ఒపి రాగా, వాటిలో 22 మలేరియా నమోదయ్యాయి. 99 కేసులు వైరల్ జ్వరాలతో బాధపడుతున్న రోగులు ఉన్నారు. మరో 38 ఇన్‌పేషన్లకు గానూ 25 వరకు మలేరియా రోగులకే చికిత్స పొందుతున్నారు.

ఒపి కోసం బారులుతీరిన రోగులు

సీతంపేట ఏజెన్సీలో ధోను భాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అధికంగా మలేరియా కేసులు నమోదువుతున్నాయి. దీంతో పాటు కుసిమి, మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు ఐదు కేసులుపైగానే నమోదవుతున్నట్లు అధికారిక లెక్కలున్నాయి. అంతేకాక ఇప్పటికే మన్యం జిల్లాలో హైరిస్క్ మండలాలైన సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, భామిని, కొమరాడ, జియ్యమ్మవలస, వీరఘట్టం, పార్వతీపురం, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో 245 హైరిస్క్ గ్రామాల్లో 977 మలేరియా కేసులు గుర్తించినట్లు సమాచారం. సీతంపేట మండలంతో పాటు భామిని, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, ఒడిశా నుంచి కూడా ఏరియా ఆసుపత్రికి రోగులు ఎక్కువ మంది వస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

వర్షాలు అధికంగా పడడంతో ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమైంది. మలేరియా, వైరల్ కేసులు వస్తున్నాయి. జూలై రెండో వారం వరకు వస్తాయి. మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులకు వైద్యం సకాలంలో అందిస్తున్నాం.

బి శ్రీనివాసరావు,
సూపరింటెండెంట్, సీతంపేట ఏరియా ఆసుపత్రి.

కొరికాన రసజ్ఞ
ఒబిసి8వ ర్యాంకు

డి.బలరాంనాయుడు
ఒబిసి 98వ ర్యాంకు

కింతలి రేష్మ
జనరల్ 58వ ర్యాంకు

యోగేశ్వర్
ఒబిసి 40వ ర్యాంకు

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-వీరఘట్టం

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. మెరుగైన ర్యాంకులు సాధించి ఐఐటిల్లో సీట్లు సంపాదించారు. సోమవారం వెలువడిన ఈ ఫలితాల్లో మండలంలోని పనస నందివాడకు చెందిన కొరికాన రసజ్ఞ ఆలిండియా జనరల్ కేటగిరీలో 78వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 8వ ర్యాంకు సాధించింది. ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా 422వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 60వ ర్యాంకు సాధించింది. రసజ్ఞ 9,10 గుడివాడలోని కెకెఆర్ గౌతమ్ స్కూల్‌లో చదువుకుంది. ఇంటర్ విజయవాడలోని చైతన్య కళాశాలలో చదువుకుంది. తల్లిదండ్రులు శ్రీనివాస్, రవణమ్మ వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విజయం తమ గ్రామానికి ఒక గుర్తింపు తెచ్చిందని పనసనందివాడ మాజీ సర్పంచి కోరికాన సన్యాసి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

జెఇఇ అడ్వాన్స్‌లో బలరాం నాయుడుకు 633వ ర్యాంక్

పార్వతీపురం టౌన్ : జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి బలరాం నాయుడుకు ఆలిండియా 633, ఒబిసి కోటాలో 98వ ర్యాంకు సాధించాడు. బలరాంనాయుడు తండ్రి ద్వారపుడ్డి తిరుపతినాయుడు కాంట్రాక్టర్ కాగా, తల్లి శకులంత వైద్యురాలు. బలరాంనాయుడు ర్యాంక్ సాధించడం పట్ల ఆయన పెదనాన్నలు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్ హర్షం వ్యక్తం చేశారు.

జోగింపేట గిరిజన విద్యార్థుల ప్రతిభ

సీతానగరం : మండలంలోని జోగింపేట గిరిజన బాలుర ప్రతిభ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఎస్టీ కేటగిరీలో జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ పి.ధర్మారావు తెలిపారు. వీరిలో పెద్దింటి జగదీశ్వరరావు 1178వ ర్యాంక్, కె.అభిరామ్ 2116వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. వీరు ఐఐటిలో ర్యాంకులు సాధించినందుకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

విజయనగరం టౌన్: చీపురుపల్లి పట్టణానికి చెందిన కింతలి రేష్మ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 58వ ర్యాంకు సాధించింది. విజయవాడలో ఇంటర్ చదువుకుంది. తల్లిదండ్రులు బుక్ షాపు నడుపుకుంటూ కుమార్తెను చదివించారు. ర్యాంకు సాధించడం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

విజయనగరానికి చెందిన లకినేని సాయి ప్రియతమ్ ఒబిసి కేటగిరిలో 178వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 1081వ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నం లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్న సాయి ప్రియతమ్ తండ్రి ఎల్‌వి గంగాధర్ ఖజానా కార్యాలయంలో ట్రెజరీ డిపార్టుమెంట్‌లో సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి శ్రీవాణి గృహిణి.

యోగేశ్వర్‌కు 284వ ర్యాంకు

రామభద్రపురం : ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన యోగేశ్వర్ అడ్వాన్స్ పరీక్షల్లో ఆలిండియా జనరల్ కేటగిరిలో 284వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరిలో 40వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఇటీవల వెల్లడైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా 853వ ర్యాంకు, ఒబిసి కోటాలో 135వ ర్యాంకు సాధించాడు. విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుకున్న యోగేశ్వర్ ఇటీవల తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో 79వ ర్యాంకు సాధించాడు. బాలుడు తండ్రి సాలూరు సత్యసాయి జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుండగా తల్లి ఎర్రయ్యమ్మ ఒక ప్రైవేటు స్కూల్లో పనిచేస్తున్నారు. ముంబై ఐఐటిలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చేసి సివిల్స్ లో ఉత్తీర్ణత సాధించాలన్నది తన ఆశయమని యోగేశ్వర్ తెలిపాడు.

పౌష్టికాహార లోపంతో ఎవరూ బాధపడకూడదు : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పౌష్టికాహార లోపంతో జిల్లాలో ఎవరూ బాధ పడకూడదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యరాణి అన్నారు. మండలంలోని గిరిజన ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలు, 7 నెలల నుండి 3 ఏళ్ల చిన్నారులకు పాలపొడి ప్యాకెట్లను సోమవారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పౌష్టిక ఆహార లోపం అంటే శరీరానికి అవసరమైన పోషకాలు తగినంతగా లేకపోవడంతో ఈ సమస్య ముఖ్యంగా పిల్లలు, గర్భిణుల్లో కనిపిస్తుందన్నారు. పౌష్టిక ఆహార లోపం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. పౌష్టికాహార లోపం వల్ల బలహీనత, అలసట, రోగనిరోధక శక్తి తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయడం జరిగిందిన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని సాలూరు, పాచిపెంట ఆదివాసీ ప్రాంతాల్లో ప్రారంభించినట్లు తెలిపారు. పాలపొడి వంటి పోషకాహార అంశాల ద్వారా మాతా శిశువులు మరింత బలపడతారని తెలిపారు. అనంతరం గిరిజన గర్భిణులకు సీమంతాలు నిర్వహించి వారికి చీర సారెలతో సాగనంపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనక దుర్గ, గిరిజన మహిళలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి ఎడమ కాలువకు సాగునీరు అందించాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకొండ మండలంలోని తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరందడం లేదని, దీనివల్ల రైతులు చాలా అవస్థలకు గురయ్యే పరిస్థితి ఉందని, వెంటనే సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు సంఘ నాయకులు రైతులు వినతిపత్రాన్ని అందించారు. ముందుగా కలెక్టరేట్ బయట ప్లే కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల్లో గల సుమారు 45 గ్రామాల పరిధిలో తోటపల్లి ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు లేక వేలాది ఎకరాలకు గత 12ఏళ్లుగా సాగునీరందడం లేదని, ఇది చాలా దారుణమని అన్నారు. ఎడమ కాలువ ఆధునీకరణ పనుల కోసం ప్రభుత్వం రూ.193 కోట్లు కేటాయించగా ఖర్చు చేసింది మాత్రం కేవలం రూ.23 కోట్లేనని, మిగిలిన మొత్తం ఎక్కడుందో వెతికితీయాలని కోరారు. 37 కిలోమీటర్ల పొడవు ఉన్న కాలువలో సుమారు 11 కిలో మీటర్ల వరకే సిమెంట్ లైనింగ్ చేశారని, మిగతా పని ఎన్నేళ్లకు పూర్తి చేస్తారో కూడా తెలియదని, పెద్దబుడ్డిడి వద్ద సైఫోన్ పాడై దశాబ్దాలు దాటిందని, ఇంతవరకు దాన్ని బాగు చేయలేదని తెలిపారు. అందువల్ల అక్కడి నుంచి కిందికి నీరు రావడం లేదని, సైఫోన్ బదులు అక్కడ ప్రతిష్టమైన దోనే నిర్మిస్తే నీరు సాఫీగా ప్రవహిస్తుందని వివరించారు. కాలువ నిర్వహణకు 38 మంది లష్కర్లు అవసరమని, కానీ ఉన్నది ఆరుగురేనని, కొరత కాలువ వల్ల నీటి నిర్వహణ సాధ్యం కావడం లేదని, నీరు నిరంతరం వృథాగా పోతుందని అన్నారు. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టు మధ్యలో నిల్చుకోవడం వల్ల షెల్టర్లు, బోర్లు, పైపు లైన్లు మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు. కావున, తక్షణమే 32 మంది లష్కర్లను, నియమించాలని, తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేసి సిల్ట్ తీసి మదుములు, షటర్లు బాగుచేయాలని అన్నారు. తోటపల్లి ఇరిగేషన్ అధికారులు కాలువల ఆధునీకరణకు, ఇతర అవసరాలకు 2025-26 బడ్జెట్లో కేటాయించింది రూ.47 కోట్లేనని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రూ.590 కోట్లు నిధులు కేటాయించమని డిమాండ్ చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోయే పరిస్థితి లేదని అన్నారు. కావున వెంటనే రైతులు తమ బాధను అర్థం చేసుకొని, ఇరిగేషన్ అధికారులు అడిగిన మొత్తం తక్షణమే కేటాయించాలని, ప్రభుత్వానికి చెప్పి యుద్ధ ప్రాతిపదికమైన పనులు చేయించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీటిపై కలెక్టర్ స్పందిస్తూ లష్కర్ నియమిస్తామని, జంగిల్ క్లియరెన్స్, షట్టర్ రిపేర్లు తదితర సమస్యలు పరిష్కరిస్తామని రైతులు కూడా సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, తోటపల్లి ఎడమ కాలువ పాలకొండ మండలం ఆయకట్టు రైతులు యిద్దుబోయిన సింహాద్రి, బోనమంతు స్వామి, శేఖరు, గంగుల శ్రీనివాసరావు, మచ్చ విజయ్ కుమార్, కాయలు భాస్కరరావు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, డిఆర్ఒ కె.హేమలతలతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి 63 దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, పునఃపరిశీలన లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని తెలిపారు. కార్యక్రమంలో పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో...

పార్వతీపురంరూరల్ : స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎఎస్‌పి అంకితాసురాన ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేది కార్యక్రమాన్ని సోమవారంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్బీ సిఐ ఆదామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్ కు 32 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించుకున్నారు. వీటిలోకొన్ని...



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

చిన్నపొల్లకు గేదెల శ్రీలత తనకు కుట్టుమిషన్ మంజూరు చేయాలని, జమ్మడుగూడకు చెందిన సవర కళ్యాన్ దోనుబాయి నుండి జమ్మడుగూడ వరకు రోడ్డు మంజూరు చేయాలని, పూతికవలసలోని గూడెంగి కాలనీకి చెందిన ఊయక సుందరావు ఇంటింటికి కొళాయి ఇప్పించాలని వినతిపత్రాలు అందజేశారు. అలాగే సవర కురిడింగికి చెందిన బొంతు జగన్ మామిడి, జీడి మొక్కలు ఇప్పించాలని, కోడిసకు చెందిన హిమరక రవి 1బి అడంగల్ ఇప్పించాలని, పద్మాపురానికి చెందిన మనోసింగు డాలు ట్రాక్టర్ లోన్ మంజూరు చేయాలని వినతి పత్రాలు సమర్పించారు. పనసలోవ గ్రామానికి చెందిన బెజ్జి కృష్ణారావు కొండపోడు పట్టా మంజూరు చేయాలని, కుసిమికి చెందిన పాలక ఉమా నర్సింగ్ సీటు ఇప్పించాలని, రేగులగూడకు చెందిన సవర రామకృష్ణ భాషా విద్యా వాలంటీరుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్ఒ వెంకట గణేష్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కఇరస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జెసి శోబిక, డిఆర్ఒ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కలిసి పని చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణా మండలి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాల్‌లో గుడ్డ సంచులను కలెక్టర్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి, జీవాలకు చాలా హానికరమైందని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తొలగించడానికి అంతా కలిసి పని చేయాలన్నారు. ప్లాస్టిక్ రక్కసి నుంచి జిల్లాకు సంపూర్ణంగా విముక్తి కలిగిద్దామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రకృతికి హాని కలుగుతుందన్నారు. పశువులు, పక్షులు, జలచరాలు ప్లాస్టిక్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చూస్తున్నామని, ప్లాస్టిక్ వాడకం నుంచి ఎంత దూరంగా ఉంటే మన ఆరోగ్యాలకు అంత మంచిదని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ప్లాస్టిక్ ఉన్న ప్రదేశంలో మొక్కలు మొలకెత్తవని, భూసారం దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాల కోసం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

5న పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం

పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మండల ప్రత్యేక అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో గురువారం పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఎస్ఎస్ శోబిక, డిఆర్ఒ కె.హేమలత, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ కరుణశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలాంటి సంఘటనలూ జరగకుండా విధులు నిర్వహించాలి : ఎఎస్‌పి

పార్వతీపురంటౌన్ : పట్టణంలో ఇప్పల పోలమ్మ ఎర్రకంచెమ్మ అమ్మవార్ల పండగ జరుగుతున్న దృష్ట్యా మంగళవారం సిరిమానులు తిరిగే సమయంలో ఎలాంటి అవాంచనీయమైన సంఘటన జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఎఎస్పి అంకిత సురాన పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం ఇప్పలపోలమ్మ, ఎర్ర కంచమ్మ గుడి ప్రాంగణాలను పరిశీలించారు,

ఎండియు వాహనాలను రద్దు చేయడం అన్యాయం

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే ఎండియు వాహనాలను ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని, దీంతో అనేక కుటుంబాలు ఉపాధిని కోల్పోయారని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు అన్నారు. పాచిపెంటలో సర్వర్లు పనిచేయకపోవడంతో రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు ఉదయం నుంచి రేషన్ కోసం పడి కాపులు కాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండియు వాహనాల రద్దును వెనక్కి తీసుకోవాలని, ఆపరేటర్లను కొనసాగించాలని కోరారు. రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తామని చెప్పడం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని తెలిపారు. బియ్యాన్ని ప్రజలు అమ్ముకుంటున్నా రంటూ దీంతో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందంటూ ప్రభుత్వం సాకులు చెప్పడం సరైన కాదన్నారు. అవినీతి జరిగితే దీన్ని అరికట్టడానికి అనేక మార్గాలు ఉన్నాయని, నగదు బదిలీ పెడితే పేదలు బియ్యం, నిత్యాసర వస్తువులు కొనుక్కోలేరని అన్నారు. ప్రభుత్వం స్పందించి నాణ్యమైన సరుకులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిన్నారావు పాల్గొన్నారు.

రేషన్ కోసం నిరీక్షిస్తున్న వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఈశ్వరరావు

నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మధ్యాహ్నం భోజన కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి - బలిజిపేట

జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు లక్ష్మమ్మ అధ్యక్షతన సోమవారం బలిజిపేటలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సిఐటియు, ఇతర ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారని, లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వీరి సమస్యలపై నిరసన తెలుపుకొనే అవకాశం కోల్పోతారని, ఇది ఒకరకంగా దేశంలో నిరంకుశ విధానాలను అవలంభించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమ్మె జయప్రదానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గుర్తింపు కార్డులు, కాటన్ చీరలు, కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భవాని, రూప, నారాయణమ్మ, మంగమ్మ, కళ్యాణి, మేరమ్మ, లక్ష్మి, లక్ష్మిమ్మ, అధిక సంఖ్యలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు

అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్

అమ్మవార్లను దర్శించుకున్న హైకోర్టు, జిల్లా జడ్జిలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం గ్రామ దేవతలైన ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ అమ్మవార్లను సోమవారం రాత్రి పట్టణానికి చెందిన గుజరాత్ హైకోర్ట్ జడ్జి సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, జిల్లా అదనపు జడ్జి బి.దామోదర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలుకగా, వేద పండితుల ఆశీర్వాదించారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - సాలూరు

కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం సాలూరులో లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2,49,136 విలువైన మూడు చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కష్టకాలంలో ప్రజలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాలా కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న వారిలో సాలూరు మండలం తోణంకు చెందిన వారణాసి గోవిందరావు, సాలూరు పట్టణంలోని 22వ వార్డుకు చెందిన బోనం శారద, మెంటాడ మండలం లక్ష్మీపురానికి చెందిన కందివలస శ్రీను ఉన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ నిర్మల, గిరిజన యువత

భూ కబ్జాపై సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కేసలి పంచాయితీ కుమ్మరివలసలో గ్రామ కంతానికి చెందిన భూమిని భూస్వాములు కబ్జా చేసి స్వాధీనం చేసుకున్నారని సర్పంచ్ సత్తారపు నిర్మల సోమవారం స్థానిక తహశీల్దార్ డి.రవికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. అమాయక గిరిజనులను మోసగించి గ్రామకంతం భూమిని భూస్వాములు కబ్జా చేయడం సబబు కాదని, క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి కబ్జా చేసి స్వాధీనం చేసుకొని తిరిగి గ్రామ కంతానికి అప్పజెప్పాలని ఆగ్రామ గిరిజనులు కె.త్రినాథ, జె.గౌరీష్, ఎస్.దుర్గారావు, డి.సింహాచలం కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజన యువత పాల్గొన్నారు.

బస్సు నడపాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

నారాయణపురం బ్రిడ్జి ప్రారంభించి పాత పద్ధతిలో పార్వతీపురం నుండి - గౌరీపురం బస్సును పునరుద్ధరించి బలిజి పేట వరకు నడపాలని, నారాయణపురం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరుతూ సిపిఎం నాయకులు రెడ్డి వేణు, వై.మన్మధరావు, రామారావు కలెక్టర్‌కు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు..ఇందుకు వెంటనే స్పందించిన కలెక్టర్ ఆర్టీసీ, పంచాయతీరాజ్ అధికారులకు 10 రోజుల్లో సమస్య పరిష్కరించాలని, బస్సు నడపాలని ఆదేశాలిచ్చారు

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని అర్హులైన పేద కుటుంబాలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ పి.బాల తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, పేదలకు ప్రభుత్వం అందించనున్న ఇళ్ల స్థలాల కోసం గ్రామ సచివాలయాల వద్ద ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇళ్ల స్థలం కోసం అర్హులైన వారంతా తగిన ఆధారాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని, వారి వివరాలు పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఖరీఫ్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో రైతులకు ఖరీఫ్‌లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ నాయకులు వి. దాలినాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, తీళ్ళ గౌరీశంకరరావు తదితరులు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను కలిసి సమస్యలను వివరించారు. రానున్న ఖరీఫ్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు ఎటువంటి కొరత ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలన్నారు. ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కాలువల్లో పూడికతీత పనులు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పాడి పశువులకు బలవర్ధకమైన పోషణ అందించడం వల్ల అధిక పాల దిగుబడులు సాధించవచ్చునని పెద్దబొండపల్లి, ఎమ్మార్ నగరం పశు వైద్యులు డాక్టర్ భోగి చక్రధర్ రావు, డాక్టర్ రెడ్డి రమేష్ అన్నారు. మండలంలోని పశు వైద్య కేంద్రాల పరిధిలోని పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా సోమవారం పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా జరిగిన ఈ పంపిణీ కార్యక్రమ వల్ల పాడి రైతులకు ఎనలేని లబ్ధి చేకూరుతుందన్నారు. మూడు దఫాలుగా అందించే ఈ దాణా పంపిణీ మొదటి విడతగా ఈరోజు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యులు తెలిపారు.

ఇఒకు కురుపాం బదిలీ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒగా పనిచేస్తున్న కంది సురేష్‌కు గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కురుపాం మేజర్ పంచాయతీ రెగ్యులర్ ఇఒగా బదిలీ అయ్యారు. మక్కువ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తూ రెండు సార్లు అదనపు ఇఒగా పని చేశారు. అలాగే తూరుమామిడి, బంగారువలస, పనసభద్ర, కాశీపట్నం, వెంకంపేట, కన్నంపేట పంచాయతీల్లో సెక్రటరీగా మక్కువ ఇఒగా వేపాడకు చెందిన బెహరా శ్రీనివాసరావును నియమించినట్లు తెలిసింది

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మానపురంలో సోమవారం స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ఎ.చిన్నారావు ఆధ్వర్యంలో ఎంపిపి బి.ఆదినారాయణ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం జరుగుతుందన్నారు. ఈనెల 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించడానికి ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపిపి ఆదినారాయణ

నిర్వాసిత గ్రామ సమస్యలు పరిష్కరించాలి

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇళ్లకు బిల్లులు ఇవ్వాలి

తోటపల్లి నిర్వాసితుల సంఘం జిల్లా కన్వీనర్ బంటు దాసు డిమాండ్

ప్రజాశక్తి -పార్వతీపురం

తోటపల్లి బ్యారేజీ నిర్వాసిత గ్రామమైన పిన్నింటి రామినాయుడువలస గ్రామ సమస్య పరిష్కరించాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇళ్లకు నిర్మాణ బిల్లులు చెల్లించాలని తోటపల్లి నిర్వసితుల సంఘం జిల్లా కన్వీనర్ బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు నిర్వాసిత గ్రామస్తులు, నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బంటు దాసు మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ 28న, ఈ ఏడాది మే 12న నిర్వాసిత గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ స్పందన కార్యక్రమంలో విన్నవించుకున్నా నేటికీ ఏ ఒక్క సమస్యా పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపట్టకపోవడం దారుణమని అన్నారు. నిర్వాసితులను విస్మరించడం చాలా అన్యాయమని మండిపడ్డారు. పిన్నింటి రామినాయుడువలస గ్రామ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇళ్లు నిర్మించుకున్న వారికి నేటికీ అనేక మందికి బిల్లులు చెల్లించలేదన్నారు. నిర్వాసితులు నిర్మించుకున్న ఇంటికి నిర్మాణాలకు ప్రభుత్వం ఎంత కేటాయించిందోనని అడిగినా అధికారులు చెప్పకపోవడం అన్యాయమని వాపోయారు. పిన్నింటి రామనాయుడు వలసలో కేటాయించిన స్థలంలో అంగన్వాడి, పాఠశాల, కమ్యూనిటీ భవనాలు గాని, తాగునీటి సదుపాయాలు గానీ ఇంతవరకు కల్పించలేదని, అలాగే మరి కొంతమంది వితంతువులకు, అర్హులైన వారికి కూడా స్థలాలు కేటాయించలేదని తెలిపారు. కావున ఇకనైనా జిల్లా అధికారులు, ప్రభుత్వ కలుగజేసుకొని పిన్నింటి రామినాయుడువలస గ్రామ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే భవిష్యత్తులో మరో తోటపల్లి పోరాటానికి తలపెట్టాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో ఇంద్రియ నిగ్రహం : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాతో ఇంద్రియాలను మన ఆధీనంలో ఉంచుకోవచ్చని ఐటిడిఎ ప్రాజెక్టు పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణా కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ నెల 20 వరకూ యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యోగా ద్వారా ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, ఎఒ దుర్గా ప్రసాద్, డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యంనాయుడు, గిరిజన సంక్షేమశాఖ అధికారి ఆర్.కృష్ణవేణి, వైద్య ఆరోగ్య, విద్యా, గిరిజన సంక్షేమ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కు గేటు వద్ద ఐటిడిఎ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో స్థానిక ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర ఇఇ రమాదేవి, ఎంపిడిఒ బిబి మిశ్రో, డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

యోగాంధ్రాలో రంగవల్లుల పోటీలు

పార్వతీపురం : యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐసిడిఎస్ ఆధ్వర్యాన ప్రాజెక్ట్ డైరెక్టర్ డా:టి. కనక దుర్గ పర్యవేక్షణలో స్థానిక ఆర్‌సిఎం ప్రాంగణంలో మహిళలతో రంగవల్లి (ముగ్గుల పోటీలు) నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా రంగవల్లుల కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిశు గృహ, బాల సదనం, మహిళా శిశు సంక్షేమ శాఖ, వన్ స్టాప్ సెంటర్ మహిళలు, పలు శాఖల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

యోగా చేస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, సిబ్బంది

వీరఘట్టం: స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో రంగులవల్లికల కార్యక్రమాన్ని ప్రదర్శించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమల్ల నిర్వహించినటు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, ఎపిఒ జి.సత్యం నాయుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు గురైన వారంతా తరలిరావాలి

4న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వెన్నుపోటుకు గురైన రైతులు, నిరుద్యోగులు, మహిళలు ఈనెల 4న వైసిపి ఆధ్వర్యాన నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి తరలిరావాలని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. వెన్నుపోటు దినంపై పార్టీ ప్రచురించిన గోడ పత్రికలను ఆయన మండలం నాయకులతో కలిసి విడుదల చేశారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపినట్లు సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీలో భాగంగా నియమించిన ఎమ్ డియూ ఆపరేటర్లను తొలగించడం వల్ల మారుమూల గ్రామాల్లోని గిరిజనులకు తీరని నష్టం జరుగుతుందని చెప్పారు. జీవో 3 పునరుద్ధరణ, షెడ్యూల్ గ్రామాల ప్రకటన పై హామీ ఇచ్చిన ప్రభుత్వం గిరిజనులను నిలువునా మోసం చేసిందని దుయ్యబట్టారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గం లో సుమారు 40 మంది చిరుద్యోగులను రోడ్డున పడేశారని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వంలో ఏడాది మోసపూరిత పాలనకు నిరసనగా బుధవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి బాధిత ప్రజలతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గిరిరఘు, మాజీ కౌన్సిలర్ పిరిడి రామకష్ణ, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, పాచిపెంట మండలం నాయకులు గొట్టాపు ముత్యాల నాయుడు, పాచిపెంట చినబాబు, సాలూరు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : కూటమి ప్రభుత్వం ఏడాది వెన్నుపోటు పాలనకు నిరసనగా ఈనెల 4న స్థానిక వైయస్ఆర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని, వైసిపి శ్రేణులు, ప్రజలతో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో మాట్లాడారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజన్నదొర, వైసిపి నాయకులు

కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షఫీ, బిసి సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొండ : వైసిపి ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల పట్టణ కన్వీనర్లు కనపాక సూర్య ప్రకాష్, వెలమల మన్మధరావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎమ్మెల్సీ స్వగృహంలో విడుదల చేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ధవళేశ్వరరావు కౌన్సిలర్లు పల్లా భాను, తూముళ్ళ లక్షణ, సర్పంచులు విశ్వేశ్వరరావు, నెల్లి శివప్రసాద్, దుంపల చిన్ని తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జూన్ 4న కురుపాంలో చేపట్టబోయే వెన్నుపోటు దినం కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు పాల్గొని జయప్రదం చేయాలని మండల ఎంపిపి కె.దీనమయ్య పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురంలో సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి, జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాధ, నాయకులు గోరిశెట్టి గిరి, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

కూలీలకు వేతనాలివ్వరా?

వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉపాధి హామీ చట్టం కింద నెలల కొద్దీ పనులు చేయించుకున్నా నేటికీ వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు రోజువారీ ఖర్చులకు ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే వీరికి వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహా కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని కొటియా గ్రూపు సరిహద్దు గ్రామమైన ఎగువసెంబిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలల తరబడి ఉపాధి పనులు చేసినా ఇప్పటి వరకు కూలీలకు కూలి డబ్బులు చెల్లించకపోవడం సరికాదని, ప్రభుత్వం పేదలకు, నిరుపేదలకు ఉపాధి నిచ్చే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతిరోజు పనులు పనిచేయించుకుంటూ వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలకు రోజువారి ఖర్చులకు చాలా ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు రుణమాఫీలు పేరిట లక్షల కోట్ల రూపాయలను మాఫీలు చేస్తూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తుందని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా చేసిన పనులకు చట్ట ప్రకారం కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు చేస్తున్న చోట కూలీలకు నీడ, నీళ్లు, ప్రాథమిక చికిత్స నిమిత్తం మందులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు తాడంగి సన్నం, ఉపాధి కూలీలు సింగురు, కుంబులు,కొంబులు మహేష్ జూంబ్రి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ డిఇఒను నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాకు రెగ్యులర్ జిల్లా విద్యా శాఖ అధికారి (డిఇఒ)ను నియమించాలని, డెప్యూటేషన్‌పై డిఇఒ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్‌జిటి శంకర్‌రావును తిరిగి పాఠశాలకు పంపించాలని, ఇన్‌ఛార్జ్ డిఇఒగా నియమించబడిన ఎంఇఒను వెనక్కి పంపించాలని డిమాండ్ చేస్తూ పలు గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, బి.రవికుమార్, ప్రజా సంఘాల నాయకులు వి.దాలినాయుడు, పి. సంగం, ఇంకికుప్పల రామకృష్ణ, ఆరిక చంద్ర శేఖర్ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వరుసగా మూడు సార్లు పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో మొదటి స్థానం వచ్చిన జిల్లాకు రెగ్యులర్ డిఇఒ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. గతంలో ఐటిడిఎలో డెప్యూటేషన్‌పై పనిచేసి సస్పెండ్ అయిన ఎస్‌జిటి శంకరరావును డిఇఒ ఆఫీస్‌కు వేసిన డెప్యూటేషన్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఒక ఎంఇఒను ఇన్‌ఛార్జ్ డిఇఒగా నియమించడం సరైంది కాదని తక్షణమే ఆ నియామకం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎండిఎం కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - పాచిపెంట

పౌష్టికాహారం గురించి పాలకులు, అధికారులు సభలు నిర్వహించి అవగాహన కల్పించడం మంచిదే అయిన మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాన్ని కూడా గుర్తించి వేతనాలు పెంచి ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద తులసి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. ఎంతో కష్టపడి పిల్లలకు భోజనం వండి పెట్టిన వంటలమ్మలను ఆదుకోవాలని కోరారు. స్థానిక కెజిబివి ఆశ్రమ పాఠశాల వద్ద సోమవారం నిర్వహించిన సభలో తులసి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు రెండు జతల యూనిఫామ్‌లు, గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు మానుకోవాలని, వారు చేస్తున్న కష్టాన్ని గుర్తించాలని కోరాడ ఈశ్వరరావు కోరారు. విలీనం పేరుతో ఇప్పటికే అనేక పాఠశాలలు మూత పడే ప్రమాదంలో పడిందన్నారు. దీనికి తోడు రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులే కాదు ఆశా, అంగన్‌వాడీలు, కెజిబివి ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీకి గురవుతున్నారని, వీరందర్నీ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతానికి అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

వంటల్లో నాణ్యత పాటించాలి

కురుపాం : విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజన పథక వంటల్లో నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యత పాటించాలని ఎంఇఒ ఎన్.రాధాకృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మధ్యాహ్న భోజన నిర్వాహలకు విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఒకరోజు జరిగిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తుందని అన్నారు. కావున నిర్వాహకులు నాణ్యతతో కూడిన వంటకాలు వండి విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సిహెచ్ చక్రధర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

మెట్టు భూముల్లో ఆయిల్‌పాం సాగు మేలు

ప్రజాశక్తి - బలిజిపేట

వరికి ప్రత్యామ్నాయంగా నీటి సదుపాయం గల మెట్ట భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని రస్తాకుంటుబాయి కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు రైతులకు సూచించారు. విక్షిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మండలంలోని గంగాడ, బర్లి, వంతరాంలో సోమవారం పర్యటించింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్ రాజు, విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ జీవాల మిషన్‌లో భాగంగా 50శాతం సబ్సిడీ వినియోగించుకోవాలన్నారు. మట్టి పరీక్షల ద్వారా ఎరువులు వేయాలని, భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలని సూచించారు. అధిక రాబడులు కోసం రైతులు సంప్రదాయేతర వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని మరో శాస్త్రవేత్త వెంకటేశ్వరావు సూచించారు. అలాగే మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన చర్యలు శాస్త్రవేత్త తేజేశ్వరరావు, వరి పంట సాగులో తీసుకోవాల్సిన చర్యలను ఎంవి శ్రీనివాస్, పంట మార్పిడి గురించి డిపిసి వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్ వివరించారు. భూమిలో సేంద్రీయ కార్బన్ తగ్గిందని, దీన్ని పెంచుకోవాలని, ఇందుకు పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాలు వేసుకోవాలని తెలియజేయడం పార్వతీపురం వ్యవసాయశాఖ ఎడిఎ టి.వెంకటేశు తెలిపారు. పామ్ ఆయిల్ సాగు విధానాన్ని ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూష వివరించారు. కార్యక్రమంలో ఎఒ, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

ఆర్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టంపై మండలంలోని ఊసకొండ గిరిజన గ్రామంలో సర్పంచ్ కొండగొర్రె సులోచన ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.సూర్యం మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబానికి ఏడాదిలో 150 రోజులు పని దినాలు ప్రభుత్వం కల్పించాలని, కావున ప్రతి ఒక్కరూ 150 రోజులు పని చేసేలా ఉండాలని అన్నారు. అలాగే 18ఏళ్లు నిండిన వారందరికీ తప్పనిసరిగా జాబ్ కార్డు ఉండాలని, ఎవరికైనా జాబ్‌కార్డు కానీ, పని దినాలు కానీ సక్రమంగా అందకపోతే గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియజేసి పని దినాలు అందరూ జాబ్ కార్డు పొందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఉపాధి సక్రమంగా పొందితే వలసలు నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ సంస్థ ఫీల్డ్ కోర్డినేటర్స్ చిరంజీవి, అలిమ, రాధ, రోజా, ఊర్మిళ గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టంపై వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న సూర్యం

పంపిణీకి పుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి - వీరఘట్టం

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఫౌండేషన్, బేసిక్, మోడల్, ప్రాథమిక ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కెజిబివి, తదితర 62 పాఠశాలల్లో 4022 మంది విద్యార్థులకు గానూ 20,203 పాఠ్యపుస్తకాలు ఒకటి నుండి పదో తరగతికి సంబంధించిన విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. యూనిఫారాలు, బూట్లు రావాల్సి ఉంద న్నారు. ఆయనతో పాటు ఎంఆర్‌సి సిబ్బంది ఉన్నారు.

విత్తనాల కోసం 7లోగా పేర్లు నమోదు చేసుకోవాలి : ఎఒ

వీరఘట్టం : మండలంలోని 24 రైతు సేవా కేంద్రాల పరిధిలో గల చిన్న, సన్నకారు రైతులు ఈనెల 7లోగా విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు తక్షణమే తమ పేర్లను అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. 10 కేజీల పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై రూ.610కు, 10 కేజీల నవధాన్యాలు కిట్టు 50శాతం రాయితీపై రూ.648కు విక్రయించనున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రపై అవగాహన

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను విశ్రాంత ఉపాధ్యాయులు గొన్నాబత్తుల దుర్గారావు వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.గణేష్ బాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 అంశంపై అన్న అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. ముగింపు రోజు ఈనెల 6న బహుమతులు అందజేస్తామన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఈ పోటీల్లో పాల్గొవచ్చన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారు చార్టు, రంగులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఈశ్వర్ ఉన్నారు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - సీతానగరం

కౌలు రైతులందరికీ వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మ నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ జయప్రసన్నకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఁమండలంలో సుమారు 4000మందికి కార్డులు అందజేయాలని, వీరిందరికీ అన్నదాత సుఖీభవ చెల్లించాలని కోరారు. అలాగే కౌలు రైతులందరికీ సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.ఈశ్వరరావు, రైతు సంఘ నాయకులు ఎం.రాఘవ, ఆర్.సత్యనారాయణ, సిహెచ్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న రైతుసంఘం, కౌలు రైతు సంఘం నాయకులు

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని మరికి పంచాయతీ బండిదొరవలస మలుపులో సోమవారం ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఇంకొకరికి తీవ్ర గాయాలైన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే మరికి గ్రామం నుండి పార్వతీపురం బైక్‌పై వస్తున్న చాట్ల సింహాచలం (32) మరికిలో సామాన్లు డెలివరీ ఇవ్వడానికి వెళ్లున్న పార్వతీపురం పట్టణం రామాపురం కాలనీకి చెందిన డి.రాజు అనే ఈ కామర్స్ కొరియర్ బాయ్ ఎదురుగా ఢీకొన్నారు. దీంతో సింహాచలం అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన కొరియర్ బాయ్ రాజును స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడు సింహాచలం భార్య గర్భిణి, కాగా వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. భార్య తులసి ఘటన విషయం తెలుసుకొని స్పృహ కోల్పోగా బంధువులు పరిచర్యలు చేస్తున్నారు. సింహాచలం తోటపల్లి పార్కులోని చిరుద్యోగిగా పనిచేస్తున్నాడు. అవుట్ పోస్ట్ వివరాలు కేసు నమోదు చేశారు.

మృతి చెందిన సింహాచలం